అధ్వానంగా రహదారులు


తాడిపత్రి పట్టణంలో రోడ్డుపై వర్షపు నీటిని చిమ్ముకుంటూ వెళ్తున్న బస్సు


నార్పల మండలం నిలువురాయికి వెళ్లే రోడ్డుపై గుంతలు

- చిన్నపాటి వర్షానికే రోడ్లపై మురుగు
- తాడిపత్రిలో వాహనదారుల అవస్థలు

తాడిపత్రిటౌన్: అధికారులకు ముందు చూపు లేక పోవడంతో చిన్నపాటి వర్షానికే తాడిపత్రి వాసులు చిగురుటాకులా వణికి పోతున్నారు. చిన్న వర్షానికే రోడ్లు మురుగునీటి ఆవాసాలుగా మారుతున్నాయి. చినుకు పడితే చాలు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి పట్టణంలో 36 వార్డులు, 72 కాలనీలు, దాదాపు 1.30లక్షల మంది జనాభా ఉంది. తాడిపత్రి మున్సిపాలిటీ పలు విభాగాల్లో దేశంలో ప్రథమస్థానంలో నిలిచి పలువురి ప్రశంసలు అందుకుంటోంది. అయితే వర్షం వస్తే చాలు చిగురుటాకులా వణికిపోతోంది. పట్టణంలో పలు ప్రాంతాల్లో వర్షం నీరు బయటకు వెళ్లేందుకు ఎలాంటి సౌకర్యం లేకపోవడంతో రోడ్లపై నిలిచి మురుగునీటిని తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులతో పాటు సమీప దుకాణాల యజమానులకు సైతం ఇబ్బందిగా మారింది. మురుగు నీటి కుంటలు కారణంగా దోమలు వ్యాపించి పలు రకాలు వ్యాధులు, విషజ్వరాలకు కారణమవుతున్నాయి. అలాగే వర్షం వచ్చిందంటే చాలు పట్టణంలో పలు కాలనీల్లో అంధకారం నెలకొంటోంది. గంటల తరబడి కరెంట్ సరఫరా నిలిపివేస్తుండటంతో ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

రోడ్డు గుంతలమయం

శింగనమల(నార్పల): నార్పల నుంచి నాయనపల్లికి వెళ్లే రహదారిలో నిలువురాయికి క్రాస్ అయ్యే ప్రాంతంలో రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డుకు ఒక వైపు రెండు అడుగుల గుంత పడింది. వాహనాల చోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు వాహనదారులు గాయపడ్డారు. ప్రజాప్రతినిధులు , ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చాలని మండలవాసులు కోరుతున్నారు.

కంప్యూటర్ పనిచేయదు.. ప్రింట్ రాదు


సచివాలయంలో పని చేయని కంప్యూటర్

గుత్తి: పట్టణంలోని పలు సచివాలయాల్లో రెండు వారాలుగా కంప్యూటర్లు(సిస్టమ్స్), ప్రింటర్లు పని చేయడం లేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వస్తున్న ప్రజలు సిస్టమ్స్, ప్రింటర్లు పని చేయపోవడంతో వెనుదిరిగి వెళ్తున్నారు. కొన్ని సచివాలయాలకు ఇంటర్నెట్ కూడా రావడం లేదు. సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తమ మొబైల్ ఫోన్‌లను యుఎస్బీకి కనెక్ట్ చేసుకుని పనులు చెక్క బెడుతున్నారు. షయాన్ని గత నెలలో సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ అధికారుల దష్టికి తీసుకెళ్లారు. అయినా ఇంత వరకు కంప్యూటర్లు, ప్రింటర్లకు మరమ్మతులు చేయించలేదు. మున్సిపల్ అధికారులు స్పందించి కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ఇంటర్నెట్ కనెక్షన్‌లు ఇవ్వాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

నైపుణ్యాలను మెరుగుపర్చడమే లక్ష్యం

గుంతకల్లుటౌన్: విద్యార్థుల్లో ఆవిష్కరణ నైపుణ్యాలను మెరుగుపర్చడమే కేంద్ర ప్రభుత్వ వికసిత భారత్ బిల్డ్‌థాన్ లక్ష్యమని మండల విద్యాశాఖ అధికారి సుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం దోనిముక్కల రోడ్డులోని మాంటిస్సోరి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ ప్రసంగించారు. విద్యార్థుల్లో ఆవిష్కరణలు, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ, అటల్ ఇన్నోవిజన్ మిషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా చేపడుతుందన్నారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థుల బిల్డ్‌థాన్‌లో పాల్గొంటారన్నారు. విద్యార్థులు స్వదేశీ, ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్, సమృద్ధ్ భార్ వంటి అంశాలపై తమ ఆవిష్కరణాత్మక ఆలోచనలు, నమూనాలను రూపొందించాలన్నారు. దేశవ్యాప్తంగా ఈ నెల 13 జరిగే లైవ్ బిల్డథాన్‌లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగార్జున కర్ణాటకం, డైరెక్టర్ అనిల్, బిల్డథాన్ కోఆర్డినేటర్ కిరణ్‌రావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం


పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు, నాయకులు

బుక్కరాయసముద్రం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వైఎసోస్‌ర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నిర్వహించబోయే రచ్చ బండ కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులతో కలసి శుక్రవారం బీకేఎస్ మండల కేంద్రంలోని నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా గువ్వల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వైఎస్సార్‌సీపీ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసువచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించేలా రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలకు చంద్రబాబు మోసపూరిత హామీలిచ్చి, వాటిని అమలు పరచకుండా.. ప్రశ్నించిన వారిపై కేసులు బనాయిస్తున్నారన్నారు. కేసులకు ఎవరూ భయపడరాదన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు నిలదీస్తూ ఉండాలన్నారు కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, శింగనమల, నార్పల, గార్లదిన్నె, పుట్లూరు అధ్యక్షులు పూల ప్రసాద్, ఎల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, ఖాద్‌వలి, సర్పంచ్ పార్వతి, నాయకులు పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, పూల రంగా, శేషానందరెడ్డి, గాంధీ నగర్ ఆది, రాజా, అంజి, లచ్చి పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలనకు ప్రత్యేక చర్యలు


బుక్కరాయసముద్రంలో పోస్టర్లు విడుదల చేస్తున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అరుణ కుమారి

బుక్కరాయసముద్రం/తాడిపత్రి టౌన్/పెద్దపప్పూరు/యల్లనూరు/పెద్దవడుగూరు/శింగనమల: సమాజంలో లింగ వివక్షత నిర్మూలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అరుణ కుమారి అన్నారు. శుక్రవారం బుక్కరాయ సముద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ముందుగా పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా పీడీ అరుణకుమారి మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదివి ఉన్నత రంగాలలో రాణించాలన్నారు. రోజూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆడ పిల్లలకు వివాహ వయస్సు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంత్సరాలు పూర్తి నిండాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లి జరుగుతున్నట్లయితే 1098, 100, 181 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అనంతరం పాఠశాలలో బాలికలకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ లలిత, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ నాగవేణి, బాలల సంరక్షణ అధికారి మంజునాథ్, సీహెచ్ఓ మోహన్‌కుమార్, విజయలక్ష్మి, ధనలక్ష్మి, చంద్రకళ, వెంకట్ కుమార్, అంగన్‌వాడి సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రిలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన బాలికా దినోత్సవంలో సీడీపీఓ సాహిదాబేగం, మెడికల్ ఆఫీసర్ సయ్యద్ ముష్కినల్ హక్, ప్రిన్సిపాల్ లావణ్య, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, రామలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దపప్పూరు మండలంలోని జూటూరు కేజీబీవీ కళాశాలలో ఎంఈఓ రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్‌వలి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ కుమారి, పంచాయతీ కార్యదర్శి కాసిప్, ప్రిన్సిపాల్ బయమ్మ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు.అలాగే యల్లనూరులోని కస్తూర్బా విద్యాలయంలో నిర్వహించిన బాలికా దినోత్సవంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజామణి, శాంతమ్మ, ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దవడుగూరులోని కేజీబీవీ పాఠశాలలో ఎంఈఓ రాముడు, ఎస్ఓ ఉష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరి, వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. అలాగే నార్పలలోని కేజీబీవీలో నిర్వహించిన బాలికల దినోత్సవంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ, ఎస్ఓ నిర్మల పాల్గొన్నారు.

ఒరిగిన స్తంభాలను సరిజేశారు


స్తంభాన్ని క్రేన్‌తో సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపప్పూరు: విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ఈనెల 8న ఒరిగిన స్తంభాలు..వేలాడుతున్న విద్యుత్ తీగలు అనే కథనం సాక్షి ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన ట్రాన్స్ ఏఈ నరసింహులు శుక్రవారం క్రేన్ సహాయంతో అత్తిరాలదిన్నె, సుంకేసులపల్లి, కొట్టాలపల్లి సరిహద్దుల్లో ఒరిగిన ఆరు స్తంభాలను సరిజేశారు. దీంతో అత్తిరాలదిన్నె గ్రామానికి చెందిన రైతు పుల్లారెడ్డితో పాటు మరికొందరు రైతులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

టెక్ కళాశాలలో జాతీయ సింపోజియం


విజేతలతో కళాశాల డైరెక్టర్ నటరాజేశ్వరరెడ్డి

తాడిపత్రిటౌన్: విద్యార్థుల్లో సామర్థ్యం, నైపుణ్యం వెలికితీసేందుకే టెక్‌స్పార్క్ 2కె25 నిర్వహిస్తున్నట్లు టెక్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం టెక్ స్పార్క్ 2కె25 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వైఎస్సార్, నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన దాదాపు 13 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, ప్రాజెక్ట్ హ్యాక్సన్ వంటి పోటీలు నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నటరాజశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, బోర్డ్ డైరెక్టర్స్ నీహారిక, షాలిని, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రసాద్, సీఎస్ఈ హెచ్ఓడీ నరసింహాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటి సంతకాల సేకరణ ఉద్యమం

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గం సమన్వయ కర్త శైలజానాథ్ సూచన మేరకు మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, గ్రామ కమిటీల ఏర్పాటు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 3 గంటలకు మండల కేంద్రంలోని గాంధీ నగర్, 4గంటలకు అమ్మవారిపేట, 5 గంటలకు రేకులకుంటలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పార్టీ అనుబంధ సంఘాల అద్యక్షులు, కార్యదర్శిలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

నేడు పోస్టర్ల ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించనున్నట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పట్టణ, మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వారు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

గొర్రెల యూనిట్ పరిశీలన


గొర్రెలు, పొట్టేళ్లకు ట్యాగ్‌లు వేస్తున్న పశు సంవర్ధక శాఖ సిబ్బంది

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ పల్లి సమీపంలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద ఏడాదిన్నర క్రితం ఏర్పాటు చేసిన గొర్రెల పెంపకం యూనిట్‌ను శుక్రవారం పశు వైద్యుడు ప్రదీప్ కృష్ణ, కర్ణాటక బ్యాంకు జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద 50 శాతం రాయితీతో రూ. కోటి రైతుకు మంజూరు చేసిందన్నారు. యూనిట్ లో 500 గొర్రెలు, 25 పొట్టేళ్లు ఉన్నాయన్నారు. పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్ణాటక బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ వినోద్, గొర్రెల పెంపకం యూనిట్ నిర్వాహకుడు, రైతు జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువ కలకలం


పీ కొండాపురం ఎస్సీ కాలనీలో భారీ కొండ చిలువ

పామిడి: మండలంలోని పీ కొండాపురం ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో భారీ కొండ చిలువ కలకలం రేపింది. ఆరు అడుగులకు మించి పొడవున్న కొండ చి లువ కాలనీలో సీసీ రోడ్డుపైన కదలలేని పరిస్థితిల్లో కాలనీవాసుల కంటపడింది. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. యువకులు అప్రమత్తమై కొండచిలువను కొండప్రాంతం వైపు మళ్లించడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేశవరెడ్డి

బుక్కరాయసముద్రం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వడియంపేటలో ఉన్న కేశవరెడ్డి పాఠశాలలో అనంతపురం జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. ముందుగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా జ్యోతి వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, లాంగ్ జంప్, హై జంప్, త్రోబాల్, షాట్‌పుట్, యోగా, చదరంగం తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడా కారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏజీఎం, ప్రిన్సిపాల్, యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

గుత్తి: విద్యార్థులు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొవాలని ఎంఈఓ రవి నాయక్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ నాగమణి సూచించారు. గుత్తిలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం ఎస్ఓ రుద్రాక్షి ఆధ్వర్యంలో వరల్డ్ మెంటల్ హెల్త్ డే నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ మెంటల్‌గా స్ట్రాంగ్ గా ఉండాలన్నారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్‌పై ర్యాలీ

యాడికి: మండలంలోని రాయలచెరువు పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాన మంత్రి సురక్షిత అభియాన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రంజిత్ కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ షంషాద్ బేగం, ఎంపీహెచ్ఎస్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య శిక్షణపై అభ్యసన

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో రెండో శనివారం స్త్రీల మైత్రి ఆరాధన పురస్కరించుకుని శుక్రవారం మహిళ నృత్య శిక్షణపై అభ్యసన కార్యక్రమం నిర్వహించారు, ఈసందర్భంగా పాస్టరమ్మ సువర్ణమ్మ ఆధ్వర్యంలో టీచర్ ఎస్ ప్రిస్కిల్లా సారథ్యంలో మహిళలు కోలన్న, దైవ సంకీర్తనలపై నృత్యాలపై శిక్షణ అభ్యసం చేశారు. కార్యక్రమంలో చర్చి సంఘం మహిళలు, టీచర్లు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

పుట్లూరు: మండలకేంద్రానికి చెందిన పెద్దిరాజు(42) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం ఆయన క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతడు జేసీబీ, రెండు ట్రాక్టర్లను లీజుకు తీసుకుని జీవనం సాగించేవాడు. వాహనాల వల్ల నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవడుగూరు: జిల్లా కేంద్రంలో ఈ నెల 5, 8 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో లక్ష్ముంపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శేషాచలం , పీడీ కృపాకిరణ్ శుక్రవారం తెలిపారు. జిమ్నాస్టిక్స్ అండర్ -14లో దయానంద్, కల్పన, అండర్-19లో అప్పన, వెయిట్ లిఫ్టిగ్ అండర్-17 లో రాజీకళ, అండర్-14లో గాయత్రి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

పెద్దవడుగూరు: మండలంలోని లక్ష్ముంపల్లి జెడ్పీ పాఠశాలలో చదువుతున్న క్రీడాకారులకు మాజీ ఎంపీపీ గూడూరు పెద్ద ఓబుళరెడ్డి 40 జతల క్రీడా దుస్తులను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేషాచలం, పీడీ కృపాకిరణ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి టౌన్/రూరల్: పట్టణంలో శుక్రవారం ఆరుగురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసి, రూ.4 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆరోహనరావు తెలిపారు. పట్టుబడిన వారలో నందలపాడుకు చెందిన చుక్కలూరు చాంద్‌బాషా, లక్ష్మయ్య, బంకమట్టివీధికి చెందిన మహమ్మద్ రజాక్, హరిజనవాడకు చెందిన మేకల పుల్లయ్య, శ్రీనివాసపురం నివాసి పాలమాబు, సిద్దబాషా ఉన్నారన్నారు. అలాగే చుక్కలూరు వద్ద శుక్రవారం మట్కా రాస్తున్న హసన్‌బేగ్‌ను అరెస్టు చేసి రూ.6,810 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. కదిరికి చెందిన హసన్‌బేగ్ ఉపాధి కోసం చుక్కలూరుకు వచ్చి టీ హోటల్ నిర్వహిస్తున్నాడన్నారు.

'పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి'

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యుడు డిమాండ్ చేశారు. శుక్రవారం బీకేఎస్ మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. పీఆర్‌సీ కమీషన్ ఏర్పాటు చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించి ఏకీకృత సర్వీసు రూల్స్ సాధించే దశగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పాఠశాలలోల బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి చంద్రశే ఖర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జీ, నాయక్, రామాంజనేయులు, జిల్లా కౌన్సిలర్ మృత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు గాయాలు

పుట్లూరు: మండలంలోని గోపురాజుపల్లికి చెందిన ఉపాధి కూలీలు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గ్రామానికి చెందిన జయరంగారెడ్డి, వసంత ఉపాధి పనులకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా తుఫాన్ వాహనం ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిజియోథెరపీపై అవగాహన

యాడికి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బందికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన నిమ్స్ వైద్యుల ద్వారా ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిమ్స్ వైద్య నిపుణులు రమేష్, సంతోష్ కుమార్ వెలుగు సీసీలకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

విషగుళికలు మింగి వ్యక్తి ఆత్మహత్య

పెద్దవడుగూరు: మండలకేంద్రం అయిన పెద్దవడుగూరులో శుక్రవారం విషగుళికలు తిని ప్రతాప్‌రెడ్డి(45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. అత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

అభివృద్ధి పనులపై విచారణ వాయిదా


అధికారులతో సమావేశమైన ఎంపీడీఓ

తాడిపత్రిటౌన్: మండలంలోని ఊరుచింతల గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై విచారణ చేపట్టాలని గ్రామానికి చెందిన అడ్వకేట్ రజినీకాంత్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వసుంధర ఆధ్వర్యంలో అధికారులు సమావేశం నిర్వహించారు. 2023 నుంచి 2025 వరకూ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై విచారణ జరపాల్సి ఉండగా అప్పటి అధికారులు కొంతమంది రాకపోవడంతో పాటు సరైన సమాచారం లేదంటూ విచారణను ఈనెల 17కు వాయిదా వేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్‌బాషా, సీనియర్ అసిస్టెంట్ రాజా రవికుమార్, కార్యదర్శి నరేంద్ర, గ్రామస్తులు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌కు గ్రామ కమిటీ నివేదిక అందజేస్తున్న నాయకులు

గుత్తి రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సూచించారు. మండలంలోని అనగానదొడ్డి గ్రామానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం మాజీ ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారు గ్రామ కమిటీల నియామకానికి సంబంధించిన పేపర్లను ఆయనకు అందజేశారు. వైవీఆర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని వారికి సూచించారు. అంతకుముందు నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్త రవిని పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంతకల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్‌యాదవ్, రఘునాథ్ రెడ్డి, హనుమంతురెడ్డి ఆసుపత్రికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, దేవేంద్ర, రామ చంద్ర పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

గుంతకల్లుటౌన్: ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు సిద్ధమవుతున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ సభ్యుడు శ్రవణ్ సహకారంతో విద్యార్థులకు పుస్తకాలను అందజేసి మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు సుధీర్‌కార్వా సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, రోటేరియన్లు పాల్గొన్నారు.

రూ.1.88 లక్షలు పలికిన తలనీలాల సేకరణ వేలం


వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు సమర్పించే తలనీలాల సేకరణను శుక్రవారం నిర్వహించిన వేలంలో రూ.1.88లక్షలకు దక్కించుకున్నారు. ఈఓ శోభ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో నిర్వహించిన వేలంలో రూ.20వేలు చెల్లించి ఆరుగురు పాల్గొన్నారు. పోటాపోటీగా జరిగిన వేలంలో గ్రామానికి చెందిన గంగమ్మ రూ.1.88 లక్షలకు తలనీలాల సేకరణను దక్కించుకున్నారు. ఎస్ఐ సురేష్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రంగస్వామిరెడ్డి యాదవ్, మద్దిలేటి, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ పాల్గొన్నారు.

కేవీకేలో నేడు రైతు సదస్సు

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం రైతు సదస్సు నిర్వహించనున్నట్లు కేవీకే కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సదస్సులో ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమంలో భాగంగా రూ.42 కోట్ల వ్యవసాయ ప్రాజెక్టులను ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాన్ని రెడ్డిపల్లి కేవీకేలో ప్రత్యక్ష ప్రసారం చేపడుతున్నామన్నారు. రైతులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి


రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ

గుత్తి రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు, రైతులు అందజేసిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆర్డీఓ తనిఖీ చేశారు. ప్రజలు, రైతుల నుంచి అందిన అర్జీల ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని ఆరా తీశారు. గడువులోగా అర్జీలన్నింటిని పరిష్కారం చూపాలని, అలా కాని పక్షంలో వాటిని ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్జీదారులకు స్పష్టమైన జవాబు ఇవ్వాలన్నారు. కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, డీటీ సూర్యనారాయణ, ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

యాడికి: మండలంలోని కేశవరాయునిపేట గ్రామానికి చెందిన వివాహిత చిన్న నాగమ్మ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో గురువారం ఆమె భర్త చిన్న సుబ్బన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు.